భేతాల స్వామి జాతరకు వంద ఏండ్ల చరిత్ర

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 25 : బాన్సువాడ భేతాల స్వామి జాతరకు 100 ఏండ్లకు పైగా చరిత్ర ఉందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలో యేటా నిర్వహించే భేతాల స్వామి జాతరను గురువారం ఎమ్మెల్యే పోచారం ప్రారంభించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కౌన్సిలర్లు వెంకటేశ్, కిరణ్, కోఆప్షన్ సభ్యుడు బాబా, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, పదోతరగతి పరీక్షలు ప్రారంభం

కామారెడ్డి, ఏప్రిల్ 25 : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ ఇంటర్, పదోతరగతి వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ లాంగ్వేజ్ పండిట్ పరీక్ష ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,172 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,053 మంది హాజరయ్యారు. 119 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి మొదటి రోజు లాంగ్వేజ్ పండిట్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 759 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 665 మంది హాజరయ్యారు. 94 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. మాస్‌కాపింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 25 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందని, కమిటీ సభ్యులతో పాఠశాలలను సందర్శించి కావాల్సిన మౌలిక సదుపాయాలపై నివేదికను త్వరగా సిద్ధం చేసి అందించాలని ఎంపీడీవో బషీరుద్దీన్ పీఆర్, ఏఈలకు సూచించారు. గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మౌలిక సదుపాయలపై సమీక్షించారు. కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు నివేదిక అందించాలని సూచించినట్లు తెలిపారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఏపీఎం పద్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత

దోమకొండ, ఏప్రిల్ 25 : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన బుచ్చవ్వ మొబైల్ ఫోన్‌ను రికవరీ చేసి గురువారం బాధితురాలికి అందజేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ పోయినట్లు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్‌ను రికవరీ చేసి బాధితురాలికి అందజేసినట్లు తెలిపారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు
- కానరాని పరీక్షలు.. కరువైన పర్యవేక్షణ
- కుళ్లిన మాంసం విక్రయిస్తున్న వ్యాపారులు
- అనారోగ్యం బారిన పడుతున్న జనం

బాన్సువాడలో మాంసాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అలీం

బాన్సువాడ, ఏప్రిల్ 25 : పట్టణంలో మాంసం విక్రయించే వ్యాపారులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రజలకు కుళ్లిన మాంసం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మాంసం విక్రయాలు పశువైద్యులు, మున్సిపల్ పర్యవేక్షణలో కొనసాగాల్సినా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో ఎవరికి వారే దుకాణాలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. దుకాణాల ముందే మేకలు, గొర్రెలను వధిస్తూ విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువై, పశువైద్యుల పరీక్షలు లేకపోవడంతో ఇష్టా రాజ్యంగా మాంసాన్ని విక్రయిస్తున్నారు.

నిబంధనలను తుంగలో తొక్కుతున్న వ్యాపారులు

కబేలాల్లో సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండే గొర్రెలు, మేకలనే వధించాలి. కానీ.. నిబంధనలు తుంగలో తొక్కి చనిపోయిన, అనారోగ్యంతో ఉన్న గొర్రెలు, మేకలను దుకాణాల ముందే వధిస్తూ విక్రయిస్తున్నారు. మరికొంత మంది వ్యాపారులైతే గొర్రెలను వధించి మేకపొటేల్ మాంసం అంటూ ప్రజలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి మాంసం తింటే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. మటన్ మార్కెట్లో జంతువులను వధించే సమయంలో వెటర్నరి అధికారుల అనుమతి తప్పనిసరి కానీ.. వెటర్నరీ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కొసమెరుపు.

కుళ్లిన, రంగుమారిన మాంసం విక్రయం

గురువారం పట్టపగలే అందరూ చూస్తుండగానే మటన్ మార్కెట్లో 600 రూపాయలకు కుక్క కరిచిన మేకను కొనుగోలు చేసి, వధించేందుకు సిద్ధం కావడంతో అటువైపు వెళ్లిన వ్యక్తులు చూడడంతో ఈ విషయం బయటపడింది.

మటన్ విక్రయదుకాణాలపై అధికారుల దాడులు

బాన్సువాడలోని మటన్ విక్రయదుకాణాలపై పలువురు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్ అలీం గురువారం దాడులు నిర్వహించారు. దుకాణాల్లో విక్రయిస్తున్న మాంసాన్ని ఆయన పరిశీలించారు. కుళ్లిన మాంసాన్ని, సామన్లను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌లో తరలించారు. కుళ్లిన మాంసాన్ని విక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్క కరిచిన మేకను మాంసం విక్రయం కోసం తీసుకువచ్చిన వ్యాపారి

కుక్క కర్చిన మేక, కుళ్లిన, రంగుమారిన మాంసాన్ని విక్రయించేందుకు సిద్ధమయ్యారంటే మటన్ మార్కెట్ నిర్వాహకులు ఎంతకు బరితెగించారో తెలుస్తున్నది. అధికారుల అలసత్వం శాపంగా మారిందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విచారణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి, ఏప్రిల్ 25 : ఓటు నమోదు దరఖాస్తుల విచారణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల తుది జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ సిద్ధం చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం రవాణా సదుపాయం కల్పించాలని అన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు జ్యోతి, సరళ, ఉమలత, స్వప్న, ఇందిరా, ప్రియదర్శిని, అనిల్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్వీప్ ఆధ్వర్యంలో పట్టణ మహిళా సమాఖ్య సభ్యులతో మున్సిపాల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పట్టణంలోని 1,547 మహిళా సమాఖ్య సంఘాలు 16 వేల మంది సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం నిర్భయంగా ఓటు వేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి ముందుకు రావాలి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 25 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న ఫిష్ పాండ్‌ను డీఆర్డీవో చందర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతులు చేపల పెంపకానికి ముందుకు రావాలన్నారు. చేపల పెంపకానికి పీఎంఈజీపీ కింద 35 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి చేపల పెంపకం, బ్యాంకు రుణం ద్వారా ఆదాయ అభివృద్ధిని మహిళలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 25 :ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్న డబ్బులను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. నాందేడ్ జిల్లా బోకర్ గ్రామానికి చెందిన రాథోడ్ సుభాష్ వద్ద రూ.2లక్షల 88వేల500, మహారాష్ట్ర జలగావ్ పట్టణానికి చెందిన జహూర్‌భాయ్ వద్ద లక్షా 34వేల 400 రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని ఎస్సై తెలిపారు.

కుస్తీ పోటీల నిర్వహణకు సహకరించాలి

బాన్సువాడ, ఏప్రిల్ 25 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించే కుస్తీపోటీలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్ సంయుక్తంగా తెలిపారు. గురువారం గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుస్తీ పోటీల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి మహిళా మల్లయోధులు రానున్నట్లు చైర్మన్ తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 25 : మండలంలోని తాడ్కోల్ గ్రామంలో బాల్య వివాహం చేసేందుకు సిద్ధమైన తల్లిదండ్రులకు ఐసీడీఎస్ అధికారిణులు గురువారం అవగాహన కల్పించారు. బాల్య వివాహం చేయడం చట్టప్రకారం నేరమని, అమ్మాయికి తప్పని సరిగా 18, అబ్బాయికి 21 ఏండ్లు ఉండాలని అమ్మాయి తల్లిదండ్రులకు సూచించారు. ఐసీడీఎస్ అధికారిణులు కళావతి, సౌభాగ్య, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, మాదిగ సంక్షేమ సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మేరి, అంగన్‌వాడీ టీచర్ అన్వరీ పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంకుల ఏర్పాటు

బీబీపేట్, ఏప్రిల్ 25 : కలెక్టర్ ఆదేశాల మేరకు బీబీపేట్‌తో పాటు మాందాపూర్, యాడారం, కోనాపూర్, జనగామ తదితర గ్రామాల్లో నీరు వృథా కాకుండా ఉండడానికి సింగిల్ ఫేస్ మోటర్ వద్ద మినీ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. నీటి వృథా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషిచేయాలి

మత్తమాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామారెడ్డిలో

- గ్రామాల్లో మలేరియా అవగాహన ర్యాలీలు
- ప్రజలకు అవగాహన కల్పించిన వైద్యారోగ్య సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్/రామారెడ్డి/డోంగ్లీ/ భిక్కనూరు, ఏప్రిల్ 25: మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య సిబ్బంది సూచించారు. వ్యాధి నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. దోమల నివారణతోనే మలేరియా వ్యాధిని కట్టడి చేయవచ్చని తెలిపారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో గురువారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మలేరియా వ్యాధిపై ప్రజలకు చైతన్యం కల్పించారు.

ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ.. మలేరియాను అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ర్యాలీలో వైద్య సిబ్బంది చారి, దస్తీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి, సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ ఆస్మా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఈవో భీమ్, వైద్య బృందం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డోంగ్లీలో వైద్యారోగ్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీలో వైద్యాధికారిణి శ్రీలేఖ మాట్లాడారు. దోమలను తరిమేద్దాం.. మలేరియా వ్యాధిని నిర్మూలిద్దాం అని పేర్కొన్నారు. సిబ్బంది మంజుల, శోభ, సత్తెవ్వ, భూదేవి, డీఈవో ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు ప్రభుత్వ దవాఖాన నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి హేమియా మాట్లాడుతూ.. వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని పేర్కొన్నారు. ర్యాలీలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డోంగ్లీలో..

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల వ్యవసాయాధికారి రాజలింగం

బిచ్కుంద, ఏప్రిల్ 25: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో, పుల్కల్ గ్రామ సొసైటీలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయాధికారి రాజలింగం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవొద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాల్లో జొన్నలకు క్వింటాలుకు రూ.3,180 మద్దతు ధరను ప్రభుత్వం అందజేస్తున్నదని తెలిపారు. గ్రామాల వారీగా రైతులు తమకు సూచించిన తేదీల్లో పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలన్నారు. కార్యక్రమాల్లో ఏఈవోలు సౌమ్య, సాయికిషోర్, సంపత్, సాయి, సీఈవో శ్రావణ్, పుల్కల్ సొసైటీ కార్యదర్శి సాయ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను గుర్తించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్

గాంధారి, ఏప్రిల్ 25: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను గుర్తించాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ సతీశ్‌రెడ్డితో కలిసి ఐకేపీ సిబ్బందితో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. ఐకేపీ సీసీలు, వీవోఏలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. పాఠశాలల్లో తాగునీటి వసతి, టాయిలెట్లు, విద్యుత్ తదితర సమస్యలను గుర్తించాలన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. సమావేశంలో ఎంఈవో సేవ్లా నాయక్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగరాజు, సీసీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 25: బీజేపీ కీలకనేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆయనకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

LOST DOCUMENTS

★I, KUMMARI SIDDAVVA W/o KUMMARI LAXMI KANTHAM R/o. H.No.1-76, Lingampally Kurdhu (V), Lingampet (M), Kamareddy (Dist.) I lost the Org Registration Document 455/2018, SRO Yellareddy. While I'm travelling from Gandhari To Lingampet. If anybody Found Please Call:9502336604.

NTZ-324680

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాలిక అదృశ్యం

ప్రవళిక

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రవళిక అదృశ్యమైనట్లు ఎస్సై బొజ్జ మహేశ్ గురువారం తెలిపారు. ప్రవళిక 24వ తేదీన కిరాణా దుకాణానికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రవళిక తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712686160 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మే 9,10వ తేదీల్లో

జాతీయ విద్యా విధానంపై సదస్సు

సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ, అధ్యాపకులు

బిచ్కుంద, ఏప్రిల్ 25: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మే 9,10వ తేదీల్లో జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ -2020)పై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ గురువారం తెలిపారు. ఈమేరకు సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆమె కాలేజీ అధ్యాపకులతో కలిసి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సదస్సుకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయాల నుంచి ప్రముఖులు, విద్యావేత్తలు వక్తలుగా హాజరవుతారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో రిజిస్ట్రేషన్ కోసం 9701155512 నంబర్‌లో సంప్రదించాలని సదస్సు కన్వీనర్ డాక్టర్ టి.హన్మాండ్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అకడమిక్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే

మద్నూర్/ డోంగ్లీ, ఏప్రిల్ 25: జుక్కల్ మండలంలోని పెద్దగుల్లాలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే హాజరయ్యారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనాన్ని రూపు మాపేందుకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో విలాస్ గైక్వాడ్, గైక్వాడ్ దిలీప్, మాజీ ఎమ్మెల్యే గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

డోంగ్లీ, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల కోసం ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రారంభమైంది. మండలంలోని లింబూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఇంటింటికీ తిరుగుతూ ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. అర్హులందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కార్యకర్తలు నాయకుల్లా ఎదగాలి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 25: కార్యకర్తలు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ.. నాయకుల్లా ఎదగాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆయనతోపాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.